క్లుప్తంగా

కాంటూరు కందకాల పనులు పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఏపీడీ శివాజీ

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తి, తిమ్మాపూర్ తండా గ్రామాల్లో ఉపాధి కూలీలు చేస్తున్న కాంటూరు కందకాల పనులను శుక్రవారం ఏపీడీ బాలే శివాజీ పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ పనులను త్వరగా పూర్తి చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. అనంతరం ఆధార్ సీడింగ్ పనులను, నర్సరీలు, క్రీడా ప్రాంగణాలను పరిశీలించి పూర్తి చేయాలని కోరారు. ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని సిబ్బందికి సూచించారు. టెక్నికల్ అసిస్టెంట్ వినోద్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్సై ఉమసాగర్

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శుక్రవారం సాయంత్రం జిల్లా ఎస్పీ భాస్కర్ సూచనల మేరకు ట్రాఫిక్ నియమాలపై ఎస్సై ఉమసాగర్ అవగాహన కల్పించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపేవారు ట్రాఫిక్ నియమ నిబంధనలు తెలుసుకొని వాహనాలు నడపాలని సూచించారు. కళా బృందం సభ్యులు రోడ్డు భద్రత నియమాల గురించి వీడియో ద్వారా ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో కళా బృందం సభ్యులు, పోలీస్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

సాంస్కృతిక దినోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సాంస్కృతిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. దాసరి నాగభూషణం, లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు వేణు పాల్గొన్నారు.

పేద పిల్లలకు విద్యాసామగ్రి అందజేత



విద్యాసామగ్రి అందజేస్తున్న సేవాదళ్ సభ్యులు

కోరుట్ల: పట్టణంలోని జీఎంఎస్ పాఠశాల వెనుక పూరిపాకల్లో ఉంటున్న నిరుపేద పిల్లలకు కోరుట్ల సేవాదళ్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యాసామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పుప్పాల నాగరాజు, ఉపాధ్యక్షులు వెగ్యారపు అభిషేక్, చెన్నా విశ్వేష్, ఎంఏ సోహైల్, విరాట్ పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్ లేకుండా వాహనం నడిపితే సీజ్



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై ఉమసాగర్

ఇబ్రహీంపట్నం: మండలంలోని గ్రామాల్లో వాహనాలకు నంబర్ ప్లేట్లు లేని వాహనాలు రోడ్డుపైకి వస్తే సీజ్ చేస్తామని ఎస్సై ఉమసాగర్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని ఇందిరాగాంధీ చౌరస్తా, సుభాష్ చౌరస్తా వద్ద జిల్లా గార్డ్స్ పోలీసులతో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నంబర్ ప్లేట్లు లేకుండా నడిపిస్తున్న 10 బైక్‌లను సీజ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపించిన వారికి అవగాహన కల్పించినట్లు చెప్పారు.

పశువులను టీకాతో రక్షించుకోవాలి

రాయికల్: పశువులను బ్రుసెలోసిస్ టీకాలతో సంరక్షించుకోవాలని మూటపల్లి ఆరోగ్య ఉప కేంద్రం ఇన్‌చార్జి వెంకటరమణ రైతులకు సూచించారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని కొత్తపేట గ్రామంలో దూడలకు టీకా వేశారు. భూపతిపూర్ పశు ఆరోగ్య ఉపకేంద్రం సహాయకులు దాసరి శంకర్, కొత్తపేట సర్పంచ్ బత్తిని రాజేశం, ఎంపీటీసీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మినీస్టేడియం పనులకు మోక్షం

- టెండర్ ప్రక్రియ పనులు పూర్తి
- 6.06 ఎకరాల విస్తీర్ణంలో మినీస్టేడియం, స్విమ్మింగ్‌పూల్స్
- రూ.2.65 కోట్లతో చేపట్టనున్న పనులు
- అదనంగా రూ.95లక్షలు మంజూరు



పోతారం గ్రామ శివారులో మినీస్టేడియం కోసం సేకరించిన రెవెన్యూ భూమి

సారంగాపూర్: మినీస్టేడియం పనులకు మోక్షం లభించే సమయం ఆసన్నమైంది. పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తి కావడంతో అధికారులు పనులు ప్రారంభించే కార్యక్రమానికి, మిగిలిన పనులను పూర్తి చేయడానికి చర్యలు ప్రారంభించారు. సారంగాపూర్ మండలంలో మినీస్టేడియం ఏర్పాటు చేయాలని మండలంలోని యువ క్రీడాకారులు మొదటి నుంచి కోరుతూ వస్తున్నారు. జాతీయస్థాయి పోటీలకు వెళ్లిన పలు క్రీడాకారులు సైతం మినీస్టేడియం ఏర్పాటు కావాలని డిమాండ్ చేస్తున్నారు.

రూ.2.65కోట్లతో ఏర్పాటు..

2016–17 సంవత్సరంలో మినీ స్టేడియం ఏర్పాటు కోసం సారంగాపూర్ మండలం పోతారం శివారు గ్రామం గణేశ్‌పల్లి వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డును ఆనుకుని 6 ఎకరాల 6 గుంటల రెవెన్యూ భూమిని సేకరించారు. ఈ భూమిని రెవెన్యూ అధికారులు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖకు అప్పగించారు. ప్రభుత్వం రూ.2.65 కోట్లు విడుదల చేసి, పనులకు సంబంధించిన టెండరు ప్రక్రియను అధికారులు ఇటీవల పూర్తి చేశారు. ప్రస్తుతం కాంట్రాక్టర్‌కు టెండరు అగ్రిమెంట్ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

మినీ స్టేడియంలో ఉండేవి..

మినిస్టేడియంలో అవుట్ డోర్, ఇండోర్ గేమ్స్ ఆడుకునే వీలుంటుంది. కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్‌బాల్, అథ్లెటిక్స్, టెన్నిస్, బ్యాడ్మింటన్ (షటిల్), ఇతర ఇండోర్ గేమ్స్‌తో పాటు, రెండు స్విమ్మింగ్‌పూల్స్ ఉంటాయి. ఇందులో ఒకటి పెద్దది, మరొకటి చిన్న స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేయనున్నారు.

మరో రూ.95లక్షల మంజూరుకు ప్రతిపాదన

ప్రస్తుతం రూ.2.65కోట్లతో పనులు చేపడుతుండగా, మరో రూ.95 లక్షలు మంజూరు కోసం ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు తెలిపారు. ఈ నిధులతో పూర్తిస్థాయిలో మినీస్టేడియం, స్విమ్మింగ్ పూల్‌లో మరిన్ని వసతుల కోసం ఈ నిధులను కోరినట్లు అధికారులు చెప్తున్నారు.

పనులు త్వరలో ప్రారంభిస్తాం

మినీ స్టేడియం నిర్మాణ పనులను త్వరలో ప్రారంభిస్తాం. ఇప్పటికే రెవెన్యూ అధికారులతో కలిసి భూమిని పరిశీలించాం. భూమిలో కొంత సాంకేతిక సమస్యలు ఉన్నప్పటికీ వీటిని రెవెన్యూ అధికారులు వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నిర్మాణ పనులు ప్రారంభించి ఏడాదిలోపు పూర్తి చేయాలని భావిస్తున్నాం.

– భూపతి, పీఆర్ ఏఈ, సారంగాపూర్

కేంద్రం నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి



మాట్లాడుతున్న సోమారపు సత్యనారాయణ

మెట్‌పల్లి: కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులతోనే గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని 18వ వార్డులో శుక్రవారం స్ట్రీట్‌కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రైతు వేదికలు, వైకుంఠధామాలతో పాటు ఎన్నో అభివృద్ధి పనులు కేంద్రం మంజూరు చేసిన నిధులతోనే జరిగాయన్నారు. కరోనాతో ప్రజల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మూడేళ్లుగా ఉచితంగా రేషన్ బియ్యం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్, పట్టణాధ్యక్షుడు బొడ్ల రమేశ్‌తో పాటు జేఎస్ సునీత, పూదరి అరుణ, ఇల్లెందుల శ్రీనివాస్, గుంటుక సదాశివ్, దొనికెల నవీన్, కొండ్లెపు శ్రీనివాస్, తోకల సత్యనారాయణ పాల్గొన్నారు.

పసుపు పంటకు మద్దతు ధర ప్రకటించాలి



మాట్లాడుతున్న రైతు నాయకులు

మెట్‌పల్లి: పసుపు పంటకు కేంద్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.15వేల మద్దతు ధర ప్రకటించాలని రైతు ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో పసుపు పంటకు గిట్టుబాటు ధర అందించకుంటే రాబోయే రోజుల్లో పంట సాగు గణనీయంగా తగ్గే అవకాశముందన్నారు. పసుపు బోర్డు, మద్దతు ధర అందిస్తామని నాయకులు హామీ ఇస్తున్నారే తప్ప వాటిని అమల్లోకి తేవడం లేదని ఆరోపించారు. ఆన్‌లైన్ ట్రేడింగ్ నుంచి పసుపును తొలగించి గిట్టుబాటు ధర అందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బద్దం శ్రీనివాస్‌రెడ్డి, నల్ల రమేశ్, సత్యారెడ్డి, తీగల విక్రమ్, గంగారెడ్డి పాల్గొన్నారు.

వాల్మీకిబోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి



పూజలు చేస్తున్న నాయకులు

మల్లాపూర్: వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేయడం హర్షనీయమని బోయ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంచుల నర్సయ్య, వాల్మీకిబోయ సంఘం జిల్లా అధ్యక్షుడు మీనుగు చంద్రశేఖర్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని వీవీరావుపేటలో మహర్షి వాల్మీకి ఆలయంలో వాల్మీకిబోయలతో కలిసి వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ వాల్మీకిబోయలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు చెల్లప్ప కమిషన్ నివేదిక ఆధారంగా అసెంబ్లీలో తీర్మానం చేసినందుకు సీఎం కేసీఆర్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వాల్మీకిబోయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోరె నర్సయ్య, ఉపాధ్యక్షులు కంది వెంకటేశ్, అంజయ్య, జిల్లా వాల్మీకి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గరిగంటి రవి, ప్రధాన కార్యదర్శి బొండ్ల రాజేందర్ పాల్గొన్నారు.

బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలి



వినతిపత్రం సమర్పిస్తున్న బీసీ నాయకులు

జగిత్యాలటౌన్: చట్టసభల్లో బీసీ లకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా పర్యటనకు వచ్చిన ఎంపీ అరవింద్‌ను కలిసిన బీసీ సంఘం నాయకులు బీసీలకు రాజకీయ రిజర్వేషన్ల పెంపుపై వినతిపత్రం సమర్పించారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దేశ జనాభాలో 74శాతం ఉన్న బీసీలకు రాజ్యాధికారంలో సరైన ప్రాతినిధ్యం కల్పించకపోవడంతో రాజకీయంగా, సామాజికంగా వెనుకబడిపోయామని వాపోయారు. పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టి చట్టసభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించేలా కేంద్రంతో మాట్లాడి ఒప్పించాలని అరవింద్‌కు విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్సీకి సన్మానం



ఎమ్మెల్సీని సన్మానిస్తున్న ఏఎన్‌ఎంలు

జగిత్యాలటౌన్: సర్వీసు క్రమబద్ధీకరణతో పాటు తాము ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై మండలిలో మాట్లాడిన ఎమ్మెల్సీకి రెండో ఏఎన్‌ఎంలు ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్సీని ఆయన నివాసంలో కలిసిన రెండో ఏఎన్‌ఎంలు ఎమ్మెల్సీని సన్మానించారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో అసోసియేషన్ ప్రతినిధి గూడూరి జయప్రద తదితరులు ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

బుగ్గారం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని స్వచ్ఛ భారత్ రాష్ట్ర కన్వీనర్ మంచె రాజేశ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ప్రజా గోస బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా మండలంలోని శెకల్లలో శుక్రవారం స్ట్రీట్ కార్నర్ కార్యక్రమం నిర్వహించారు. మండల అధ్యక్షుడు మేడవేని శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర కన్వీనర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పీఎం మోడీ దేశ ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెడుతున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ పాలనలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆరోపించారు. రానున్న రోజుల్లో బీజేపీకి పట్టం కట్టాలని కోరారు. ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు సత్యనారాయణ, మధుకర్, నరేశ్, ఠాగూర్, బంక రాము, లింగారెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

జగిత్యాల: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కన్వీనర్ చౌదరి అన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా సంక్షేమాధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14న చలో హైదరాబాద్ కార్యక్రమం ఉందని, అంగన్‌వాడీ టీచర్లు అందరూ పాల్గొనాలని కోరారు. అలాగే మార్చి 1, 2, 3, తేదీల్లో జరిగే అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, కార్మికుల సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా సమ్మె నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, అంగన్‌వాడీ ఉద్యోగులకు గ్రాట్యుటీ చెల్లించాలన్నారు. జీవో నంబరు 14, 19, 8లను వెంటనే సవరించాలని, రేషన్ బియ్యాన్ని శుభ్రం చేసిన వెహికిల్‌లోనే సప్‌లై చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకులు శారద, నాగమణి, స్వప్న పాల్గొన్నారు.

నాటిన మొక్కలను రక్షించాలి



మొక్కలకు నీరు పడుతున్న ఎంపీడీవో

రాయికల్: నాటిన మొక్కలపై సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ప్రత్యేక దృష్టిసారించాలని ఎంపీడీవో సంతోష్‌కుమార్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం రాయికల్ మండలం మూటపల్లి, చెర్లకొండాపూర్ గ్రామాల్లో నర్సరీలను పరిశీలించారు. అనంతరం రోడ్డుపై నాటిన మొక్కలకు ఆయన నీరు పోశారు.

ప్రతిఒక్కరూ ఇంకుడుగుంత నిర్మించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో సంతోష్

రాయికల్: ఇంటింటికీ ఇంకుడుగుంత నిర్మించుకోవాలని, గ్రామాల్లో గ్రామ పంచాయతీ పాలకవర్గం, ఈజీఎస్ సిబ్బంది సహకారంతో పనులు పూర్తి చేయాలని ఎంపీడీవో సంతోష్‌కుమార్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం సెర్ప్ గ్రామ మహిళా సంఘం అధ్యక్షులు, వీవోఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ ఇంకుడుగుంతల నిర్మాణం చేపట్టాలని, తడి చెత్త, పొడి చెత్త నిర్వహణపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. మండల సమాఖ్య అధ్యక్షుడు అత్తినేని వనిత, ఐకేపీ ఏపీఎం చక్రవర్తి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

సారంగాపూర్: బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం జరిగిన రథోత్సవానికి వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో ఇద్దరు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం లింగంపల్లికి చెందిన జాడి రాంచరణ్, జాడి శంకర్ బీర్‌పూర్ రథోత్సవంలో పాల్గొనడానికి బైక్‌పై వచ్చారు. సాయంత్రం తిరిగి వెళ్తుండగా బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామ శివారుల్లో బైక్‌ను ఆటో ఢీకొనడంతో బైక్‌పై ఉన్న రాంచరణ్ కాలు విరగగా, శంకర్‌కు తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించడంతో 108 సిబ్బంది జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతాం

పెగడపల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వం వైఫల్యాలను ఎండగడుతామని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు మండలంలోని నంచర్లలో ప్రజాగోస-బీజేపీ భరోసా స్ట్రీట్ కార్నర్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్, నాయకులు సత్యం, అంజయ్య, కొమురెల్లి, అనసూయ, మోహన్‌రెడ్డి, నరేందర్ పాల్గొన్నారు.

పుస్తెమెట్టెలు బహూకరణ

రాయికల్: మండలంలోని కుమ్మరిపల్లి గ్రామంలో భీమయ్య-లక్ష్మి దంపతుల కూతురు సుస్మిత వివాహం శుక్రవారం జరగగా కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో పుస్తెమెట్టెలు బహూకరించారు. అధ్యక్షుడు నల్ల పవన్, ఇన్‌చార్జి రాధాకృష్ణ, సూపర్‌వైజర్ రాజేశ్, కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

సామాజిక సేవకులకు సన్మానం



సన్మానిస్తున్న జమాతే ఇస్లామీ హింద్ సభ్యులు

రాయికల్: జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో సామాజిక సేవ చేసిన మహమ్మద్ మస్తాక్ అహ్మద్, యువ న్యాయవాదులైన సయ్యద్ ఇమ్రాన్, మహమ్మద్ సఫీని సన్మానించారు. కార్యక్రమంలో జమాతే ఇస్లామి హింద్ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ మజీద్, నాయకులు షోయబుల్ హక్, మునీముద్దీ, అబ్దుల్ ఖాదిర్, జగిత్యాల సెంట్రల్ ముస్లిం కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ బారి, మన్సూర్, నిహాల్, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటికే కంటివెలుగు కళ్లద్దాలు



కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

మల్యాల: మండలంలోని మద్దుట్ల గ్రామంలో కంటి వెలుగు శిబిరంలో దివ్యాంగులు, వృద్ధుల ఇళ్లకు వెళ్లి వైద్య సిబ్బంది కళ్లద్దాలు పంపిణీ చేశారు. కాగా శుక్రవారం కంటి వెలుగు శిబిరం చివరి రోజు కావడంతో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది ఇళ్లకే పరిమితమైన దివ్యాంగులు, వృద్ధులను పరీక్షించి కళ్లద్దాలు పంపిణీ చేశారు. సర్పంచ్ కెల్లెటి మల్లమ్మ, వైద్యులు దశరథ్ నాయక్, రవిశంకర్, ధర్మనాయక్, క్రాంతి, శ్రీరాములు, సూపర్‌వైజర్ సునంద, ఏఎన్‌ఎం కవిత, ఆశకార్యకర్తలు వైష్ణవి, నవ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగంగా పూర్తిచేయాలి



వర్మికంపోస్ట్ షెడ్డును పరిశీలిస్తున్న ఎంపీడీవో

మల్లాపూర్: గ్రామాల్లో ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో రాజశ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని కుస్తాపూర్ గ్రామాన్ని ఆయన సందర్శించి గ్రామపంచాయతీలో పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధిహామీ పథకం కింద చేపడుతున్న పనులను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దన్నారు. అనంతరం వననర్సరీల్లో పెంచుతున్న మొక్కలను, వర్మికంపోస్ట్ షెడ్డును పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ సరికెల లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి మురళి, నాయకులు సరికెల మహిపాల్ పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని సెలవుగా ప్రకటించాలి

మల్లాపూర్: బంజారా(లంబాడీ)ల ఆరాధ్యదైవం సంత్ శ్రీసేవాలాల్ మహరాజ్ జయంతిని పురస్కరించుకుని 15న ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించాలని గిరిజన సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు ఇస్లావత్ శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సేవాలాల్ మహరాజ్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఉత్తర్వులు విడుదల చేయడం హర్షణీయమన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

కోరుట్లరూరల్: మండలంలోని యూసుఫ్‌నగర్ గ్రామంలో సీసీరోడ్డు పనులను ఎంపీడీవో నీరజ, సర్పంచ్ గుగ్గిళ్ల తుక్కారాంగౌడ్, ఎంపీటీసీ గుగ్గిళ్ల ప్రియాంక శుక్రవారం ప్రారంభించారు. గ్రామంలో సీసీరోడ్ల నిర్మాణాలకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.20లక్షలు మంజూరయ్యాయని, ఈ నిధులతో సీసీరోడ్ల పనులు చేపట్టినట్లు వారు తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ సురేశ్‌గౌడ్, ఉపసర్పంచ్ రాజం, కార్యదర్శి అనూష పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ మహాశివరాత్రి జాతర కోసం బస్సులు

మెట్‌పల్లి: వేములవాడలో జరిగే మహాశివరాత్రి జాతరోత్సవాల సందర్భంగా మెట్‌పల్లి నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రసూనలక్ష్మి శుక్రవారం తెలిపారు. 17వ తేదీ నుంచి మూడు రోజుల పాటు బస్సులు నడుపుతామని చెప్పారు.

✦ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

మేడిపెల్లి: డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌పై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలంటూ అంబేడ్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు బంగారు దీపక్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

✦ వాహనాల తనిఖీ

కథలాపూర్: మండలకేంద్రంలో బస్టాండ్ వద్ద శుక్రవారం సాయంత్రం ఎస్సై రామచంద్రం ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు.

✦ బీజేపీ జిల్లా యువ మోర్చా కార్యదర్శిగా ఏలేటి జలేందర్‌రెడ్డి

రాయికల్: బీజేపీ జిల్లా యువ మోర్చా కార్యదర్శిగా ఏలేటి జలేందర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని ఎంపీ ధర్మపురి అరవింద్, జిల్లా అధ్యక్షుడు రెంటం జగదీష్ చేతుల మీదుగా అందుకున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

✦ నూతన నియామకం

కోరుట్లటౌన్: బీసీ సంక్షేమ సంఘం కోరుట్ల సెగ్మెంట్ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన బాలె మారుతిని నియమించినట్లు రాష్ట్ర బీసీ కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ శుక్రవారం పేర్కొన్నారు.

✦ క్షీరాభిషేకం

రాయికల్: జగిత్యాల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చొరవతో ఏసీడీ చార్జీలు రద్దు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం రాయికల్ మండలం కిష్టంపేటలో కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్సీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు తంగెళ్ల రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

✦ వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

కోరుట్లరూరల్: మండలంలోని మోహన్‌రావుపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, రాజేశ్ దంపతులు పూజల్లో పాల్గొన్నారు. సర్పంచ్ సరికెల్ల మల్లారెడ్డి పట్టువస్త్రాలు, పుస్తెమెట్టెలు అందజేశారు. ఎంపీటీసీ నర్సయ్య పాల్గొన్నారు.

✦ పోచమ్మ గుడి నిర్మాణానికి భూమిపూజ

పెగడపల్లి: మండలంలోని ఏడుమోటలపల్లిలో పోచమ్మ ఆలయం నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. విరాళాలు సేకరించి ఆలయం నిర్మించనున్నట్లు సర్పంచ్ రవి నాయక్ తెలిపారు.

✦ ఉద్యోగ వయోపరిమితిని రెండేళ్లు పెంచాలి

మెట్‌పల్లి: ప్రభుత్వ ఉద్యోగాలకు వయో పరిమితిని మరో రెండేళ్లు పొడగించాలని ధర్మపురి దేవస్థానం కమిటీ మాజీ అధ్యక్షుడు జువ్వాడి కృష్ణారావు తెలిపారు. ఈ మేరకు పట్టణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం స్పందించి మరో రెండేళ్లు పొడగించాలని కోరారు. మారుతి, అంజిరెడ్డి, రాజు, శ్రీనివాస్, నసీర్ ఉన్నారు.

వైభవంగా బోనాల పండుగ



బోనాలతో మహిళలు

రాయికల్: మండలంలోని అల్లీపూర్‌లో రజక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మదేలేశ్వర స్వామి బోనాల పండుగ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటికో బోనం, ఒడి బియ్యం స్వామివారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రజక సంఘం సభ్యులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.